ఆఖరుమాట

మొక్కపాటి నరసింహశాస్త్రి 1937-జూలై ప్రతిభ

పార్థసారథినాయుడు తన కడసారి ప్రయాణాని కంతా సిద్ధం చేసుకున్నాడు. అధైర్యం కాని బెంగ కాని ఏమీ లేదు అదివరదాకా కొంత అధైర్యమూ భయమూ కలిగినా ఈ అవతారం చాలించడమే ఉత్తమమని నిశ్చయించుకున్న తరువాత ఆ భయం గియం అన్నీ పోయినాయి.

రాత్రి సుమారు రెండుగంట అవుతుంది. బయట పండువెన్నెల. చల్లని మలయమారుతం. అన్ని వైపులా పుష్పసౌరభము. ప్రకృతిఅంతా తన్ని సంతోషంతో సాగనంపుతోన్నట్లుంది. అంత కంటె కావలసిన దేమున్నది.

ఒక్క విషయమే మధ్యమధ్య చురుక్కుమనిపిస్తోంది. కొద్ది రోజులలో ప్రభుత్వమువారు (Sir) బిరుదు ప్రసాదిస్తారని నిశ్చయంగా ఆరోజునే తెలిసింది అదికాక ఈసారి ఎన్నికలలో తనకు మంత్రిపదవి తప్పదని తమ పార్టీవారు ఏకగ్రీవంగా అన్నారు. (Lord Mayor) కావడానికి తగ్గ అవకాశములు కూడా లేకపోలేదు. ఇంతకాలం ఉండి తన కోర్కెలు కొద్దో గొప్పో సిద్ధించబోతున్న సమయంలో తమ ప్రాణత్యాగం చేసుకోవలసివచ్చినందుకుమట్టుకు కొంచెము బాధగానే ఉన్నది. కొంచెముసేపుంటే అదీ పోతుంది.

తన కాగితాలూ రికార్డులూ ఎక్కడివక్కడ అన్నీ జాగ్రత్తపెట్టాడు. జమా ఖర్చు పుస్తకాలన్నీ సవరించి ఒకచోట పెట్టాడు. రాయవలసిన ఉత్తరాలన్నీ రాశాడు. కాని ఇంక ఆఖరు ఉత్తరం రాయడానికిమట్టుకు చెయ్యాడలేదు కొంతసేపు. తన కొడుక్కి రాయాలి. పంచప్రాణాలు వాడి మీద పెట్టుకొని, వాడి కేదో మహామహుణ్ణి చేదామనుకొని, అనేకములైన ఆశలూ, వాంఛలూ, వానిలో కల్పించి, ఇప్పు డవన్నీ మట్టిలో కలిపి వాడిని ఫకీరుని చేసిపోతూ ఏమని రాయడమూ అని కొంచెము సందేహించాడు. కాని రాయక తప్పదుకదా అని ఆరంభించాడు.

ఇంటా బయటా కూడా అంతా నిశ్శబ్దంగానూ ప్రశాంతంగానూ ఉంది. ఒక్కసారి కిటికీలోనుంచి నవ్వుతున్న చంద్రుని చూచాడు. ఉత్తరం వ్రాయడ మారంభించాడు...అవును. ఆత్మహత్య చేసుకోవడము చాలా కష్టమే. కాని బ్రతుకుకంటె చావే సులభంగా తోచినప్పుడు ఇంక చెయ్యతగిన దేమున్నది. పిరికితనమే కావచ్చు; ఈకర్మఫలం ఎప్పుడో ఒకప్పు డనుభవించక తప్ప దంటారు మనవాళ్ళు. కాని ప్రస్తుతం, నన్ని ఖండఖండాలుగా చించి చెండాడవలెనని వేచిఉన్న ఈ నరసింహముల నుండి తప్పించుకొని దాటిపోతే తరవాత అనుభవం సంగతి అప్పుడు చూడొచ్చు...ఈ ఆస్తి అంతా నా చేతులతో సంపాదించాను. నా చేతులతోనే తగలేశాను. ఇంకొకళ్ళ ననవలసిన పని లేదు. ఎలావచ్చిందో తెలియదు. ఎలాపోయిందో అంతకంటె తెలియదు. కాని ఒక విషయం-అప్పుడు ఎవళ్ళుచెప్పినా ఒప్పుకోలేదు. కాని ఇప్పుడు ఒప్పుకోక తప్పదు. అన్యాయార్జితవిత్తం నిలవదు. ముమ్మాటికీ నిలవదు. అనేకమంది కూలినాలి చేసీ ముష్టిఎత్తుకొనీ సంపాదించుకున్నవాళ్ళు, అనేకమంది వితంతువులు, తిండికూడా మానుకుని ఆఖరుకు తమ ముప్పుగడవడంకోసం కూడపెట్టుకున్న చిన్న మొత్తాలు, అందరూ నన్నునమ్మి ఏదోవడ్డీ వస్తుందని నాదగ్గర దాచిపెట్టారు...అవన్నీ నా స్వాధీనం చేసుకున్నాను. ఏకోర్టువారూ నన్ను

శిక్షించలేదు. కాని ఇంతమందిఉసురూ తగలదూ! న్యాయం విచారించి శిక్షించగలిగిన సాహసుడైన ప్రభువుంటే ఈ వ్యాపారస్థులలో, ధనికులలో, ఎంతమంది, ద్వీపాంతరవాస మనుభవిస్తోందురో! మాబదులు ఆ శిక్షలన్నీ అన్యాయంగా నిరుపేద లనుభవిస్తున్నారు. నేను ఎప్పుడు ఏపని చేసినా, దేనికీ పశ్చాత్తాపపడేవాడిని కాను. తెలియక చేసిన దానికి పశ్చాత్తాపముకాని, తెలిసిఉండి కష్టనష్టములు ఆలోచించి చేసేపనికి పశ్చాత్తాప మేమిటి? ధనార్జన చెయ్యవలెనని నాకు బుద్ధిపుట్టినప్పుడు, మంచిచెడ్డ, ఉచ్ఛంనీచం అనే విచారణకూడా లేకుండా ధనార్జన చేశాను; స్త్రీవాంఛ కలిగినప్పుడు ఏపద్ధతినైతేనేమి కోరిన స్త్రీని సంపాదించి తీరాను. కాని సింహావలోకనం చెయ్యడం, చేసిన పనికి విచారించడంమట్టుకు ఎప్పుడూలేదు. పుణ్యమో పాపమో వాటి ఫలితం నేను అనుభవించి ఎరుగను. ఇకముం దెప్పుడో అనుభవిస్తానంటే నాకు నమ్మకంలేదు.

కాని నేనుచేసిన రెండుపనులకు మట్టుకు, నాటి నుంచి నేటివరకు విచారిస్తున్నాను, భయపడుతున్నాను. వాటి ఫలితమే ఇప్పు డనుభవిస్తున్నా ననే దృఢవిశ్వాసం కలిగింది నాకు. రెండూ అప్రయత్నంగా అనాలోచితంగా చేశాను. శాపమన్నా పాపమన్నా నమ్మకం భయంలేని మొండివాడికి, శాపభీతి పాపభీతి కలిగించినాయి. ఏమిలాభ మిప్పుడు! అనుభవంలోకి వచ్చినతరువాత కాని తెలియలేదు. నమ్మకం కుదరలేదు. ఇప్పుడు నమ్మకం కలిగి ఏమీ చేయడానికి వీలులేని పరిస్థితులు వచ్చినాయి.

ఇంతవరకు ఆప్రశంస ఎవ్వరిదగ్గరా లేదు. నాలో నేను అనుకోడానికికూడా భయపడేవాడిని. ఏదో భయంకరమైన అపాయం వస్తుందని తెలిస్తే ఫలాని మోస్తరు అపాయమని తెలియనంతసేపూ చాలా భయంగా ఉంటుంది. ఫలానాఅనీ అది అనివార్యమనీ తెలిసినతరువాత ఇంక భయమే మంటుంది? రాయిచేసుకు కూర్చోడంతప్ప చేసేది మరొకటిలేదు. కాని ఈ ఆఖరు క్షణంలో నీతో చెపుతే కొంత హృదయభారం తీరడమే కాకుండా, నీముందుజాగ్రతకు కొంత ఉపయోగంగా ఉంటుందని నా నమ్మకం.

ఒకప్పుడు మనయింట్లో దొంగలు పడ్డారు. ఎలా వచ్చారో, ఎలావెళ్ళారో తెలియదు. ఎక్కడా ఒక కన్నమూ తవ్వడంగాని, ఒక తలుపు బద్దలు కొట్టడంగాని, ఒక తాళం బద్దలు కొట్టడంగాని జరగలేదు. ఎలాగైతేనేమి ఇంట్లోఉండే వస్తువులన్నీ సుమారు పదివేలుకిమ్మతుగలవి పోయినాయి. నాటికీ నేటికీ ఆ వస్తువుల జాడకాని దొంగలజాడగాని, తెలియలేదు.

మన యింటి కెదురుగుండా రోడ్డుమీద మర్రిచెట్టుకింద ఒక నిరుపేదకుటుంబము, భార్యా, భర్తా, ముగ్గురు పిల్లలూ ఉండేవాళ్ళు. వాళ్ళెవళ్ళో, ఎంతకాలంనుంచి అక్కడ ఉన్నారో, ఆ కుటుంబంలో ఎంతమంది ఉన్నారో, వాళ్ళకు జీవనం ఎలా గడుస్తోందో నేనెప్పుడూ విచారించలేదు. నాకేమి అవసరం? కాని ఇప్పుడు వస్తువులు పోవడంతోటే మట్టుకు అనుమానం వాళ్ళమీద పోయింది. పేదరికమంటే అందరకూ లోకువేకదా. ముందు ఇంట్లో నౌకర్లనందరనూ ప్రశ్నించి, వాళ్ళ సామానులూ ఇళ్లూ సోదాచూచి తరువాత నా అనుమానంమీద పోలీసులు ఈ చెట్టుకిందవాడినికూడా ప్రశ్నించి వాడి సామానులుకూడా అన్నీ వెతికారు పాపం! అన్నీ ఏమున్నాయి? ఒక పెట్టా; బేడా! ఏమీలేదు. కుండలూ, దాకలూ, మూకుళ్లూ, ఎవళ్ళో వీధులో పారేసిన సీనారేకుడబ్బా ఒకటీ, సీనారేకుగొట్టాలు రెండూ, ఇదీ వాడి సంసారము. ఇందులో వాడి దురదృష్టముకొద్దీ, నా దురదృష్టముకొద్దీ, రెండు రవ్వల ఉంగరాలు, ఒక రవ్వలదుద్దూ దొరికినాయి. ఇంకేముంది! వాడిని పట్టుకొని Police stationకి లాక్కుపోయారు 'నాకు spur tank లో దొరికాయి' అని వాడు ఎన్నివిధాల మొత్తుకున్నా

వాడిమాట వినేవా రెవరు? రోడ్లమీదా చెరువుల్లోనూ రవ్వలఉంగరాలూ దుద్దులూ పడి దొర్లుతూ ఉంటాయా మరి!

ఇంక నక్కడనుంచి మామూలుకథే! పోలీసువారు వాడిని పట్టుకుని కుళ్ళబొడవడం, ఎంత కొట్టినా తన కారోజుఉదయాన్నే అవి దొరకినవి కాని తనేపాపమూ ఎరుగననీ వాటి విలువకూడా తనకు తెలియదనీ ఎన్నివిధాల చెప్పినా వినక వాళ్ళు స్వాధీనంలేకుండా కొట్టి రెండుసంవత్సరములు కఠిన శిక్ష వేశారు.

పోలీసువారు కొట్టిన దెబ్బలవల్ల లోపల అవయవములు నలిగిపోయి జబ్బు ప్రవేశించింది. ఖైదీలకు అందులోనూ ఇటువంటి దరిద్రుడికి జబ్బుచేస్తేలక్ష్య పెట్టేది ఎవరు? అడిగేదెవరు? ఆజబ్బుతోటే అలాగే కాలక్షేపం చేసుకుని బయటపడ్డాడు. మన ఇంటి ముందునుంచి వాడిభార్యా బిడ్డలూ మకాము ఎత్తేసి మరొక చెట్టుకిందకు పోయారు.

రెండు మూడు సంవత్సరాలు గడిచాయి. ఈసంగతంతా నేను మరచిపోయాను. ఒకరోజు సాయంకాలం, సుమారు అయిదు గంటలకు రటాన్ బజారులో చల్లారాం షాపుదగ్గరకువచ్చి, లోపలికివెళ్ళి నాకు కావలసిన ఒకటి రెండు వస్తువులు కొనుక్కొని, వచ్చి కారుదగ్గర నిలబడ్డాను. లోపల నుంచి నౌఖరు ఆ సామాన్లు తెస్తున్నాడు.

ఇంతలోనే ఇద్దరు ముగ్గురు వీధుల్లో తిరిగేవాళ్లు ఒక మూకుడుపట్టుకొచ్చి, అక్కడ వాళ్ళ మనిషి ఒకడు చచ్చిపోయాడనీ, తీసుకుపోయి దహనం చేసుకోడానికి ధర్మం చెయ్యమనీ అడిగారు. ముష్టి ఎత్తుకోడానికి ఇదొక దొంగవేషమని నేననుకుని పొమ్మన్నాను. ఎన్నిసార్లు చెప్పినా పోలేదు. ఇటువంటి దొంగవేషాలువేస్తే Police వారికి వప్పచెపుతానని గట్టిగా కేకవేశాను. చుట్టూ పదిమంది మూగారు. పోలీసులకు చెపుతే మాకేమిభయమూ, మేము దొంగతనము చేశామా, చూడండి అక్కడనే శవమున్నది. గొప్పవారుకదా అని ఇటువంటి కష్టములో ధర్మమడుగుతే బెదిరిస్తారేమి టని అందులో ఒకడు ఎదురుతిరిగి సమాధానంచెప్పాడు. సరే ఏదో పారేద్దామని జేబులో చెయ్యిపెట్టేసరికి తల విరియబోసుకుని గుండెలు బాదుకుంటూ పెద్దపెట్టున ఏడుస్తూ శోకదేవతలాగ ఒక ఆడమనిషి వచ్చింది. నన్ను చూడడంతోనే మరింత కేకలేస్తూ వీడే నా మొగుణ్ణి చంపినవాడు. నాకూడు మంటగలిపాడు; నాపిల్లలను దిక్కుమాలిన వాళ్ళను చేశాడు; నాఉసురు వీడికి తగలకపోతుందా? వీడిపిల్లలిలాగే ఎప్పుడేనా ముష్టెత్తుకోకపోతారా! అని గుక్కతిప్పుకోకుండా నోటికి వచ్చిన ట్లల్లా తిట్టడ మారంభించింది. వాడు నేను నిర్హేతుకంగా ఖైదుకు పంపినవానిభార్యఅని పోల్చాను. ఖైదునుంచి వచ్చినతరువాత లేవలేదుట. అలా తీసుకు తీసుకుని యమబాధ పడిపడి చచ్చిపోయాడుట. ఇదంతా ఏమితెలుసు నాకు? అంతకంతకు చుట్టూ జనసమూహం మెక్కువఅయింది. జన మెక్కువైనకొద్దీ ఆమనిషి ఏడుపూ తిట్లూ ఎక్కువైనాయి. అందరూ ఆమనిషికి సానుభూతి చూపినవారే! ఇక్కడనుంచి త్వరగా అవతలకుపోతే మాట దక్కుతుందని, జేబులోనుంచి పదిరూపాయలుతీసి మొదట ముష్టికివచ్చినవాడి మూకుట్లో పడేశాను. వాడు పోబోతుంటే ఆ ఆడమనిషి గభీమని వాడి చేతుల్లోనుంచి మూకుడు లాక్కొని త్వరలో నేనిన్ను తగలెయ్య డానికి నీ కొడుక్కి అవసరముంటుంది పుచ్చుకో అని ఆరూపాయలు నా మొహాన్ని వేసికొట్టింది. అక్కడున్న జనసమూహమంతా ఒకసారి 'బలే' అన్నారు. ఇంతలోనే పోలీసుజవాను ఒకడొచ్చి ఏమిటీ అల్లరనేసరికి అంతా తప్పుకున్నారు. నేనూ నాకారులోఎక్కి ఇంటికి చేరుకున్నాను. కాని నావొళ్ళు ఆపాదమస్తకం కంపించిపోయింది.ఆమనిషిని చూస్తే నే చేసినపాపం నన్ను శిక్షించడానికి మూర్తీభవించినట్లుగా కనపడ్డది. ఎప్పుడో ఒకప్పుడు ఆమనిషిశాపం నాకు తగిలి

తీరుతుం దనుకున్నాను. తరువాత ఆసంగతంతా మరచిపోయానుగాని మళ్లీ ఈసమయంలో జ్ఞాపకం వచ్చింది. ఆ శాపఫలమే సుమా ఇది. ఆశ్చర్యంగా లేదు.

* * *

ఇంక రెండోసంగతి. నాకు ఉత్సవాలన్నా జన సమూహాలన్నా చాలా సరదా. అపేక్ష ఏమీ లేక పోయినా ప్రజలుచూపే ఉత్సాహమూ, అక్కడ చేరే సౌందర్యమూ చూడవలెనని కుతూహలం. అందుచేత ఎక్కడ ఏఉత్సవమైనా తప్పకుండా వెళ్ళి కొన్నిగంటలు కాలక్షేపం చేసేవాడిని. అలాగే ఆనాటి ముక్కోటి ఏకాదశిరాత్రి ఉత్స వానికి పెందలాడే భోజనంచేసి పార్థసారథిగుడికి వెళ్ళాను. దేవుడిమీద భక్తిచేత కాదని వేరే చెప్పే దేమిటి!

అటువంటి సమయాల్లో సాధారణంగా నాకుకలిగే ఆనందంకంటె ఆనాడు నాకు పదిరెట్లు ఎక్కువ ఆనందం కలిగింది. కారణం నేను చెప్పలేను ఆ దీపపు వెలుగులు, ఆస్త్రీసమూహము, వారి శరీర కాంతియు, వాటినతిశయింపచేసే చీరమీదరంగులు వారిఅంగముల నలంకరించినరత్నద్యుతులు, అక్కడి వివిధపరిమళములు, పారవశ్యముకలిగించే సంగీతము, ప్రయత్నముగనో అప్రయత్నముగనో లభించిన స్త్రీ స్పర్శా - వీటిఅన్నిటివల్లా కలిగిన ఆనందం ప్రతి రక్తనాళములోనూ ప్రవేశించినన్ను ఉన్మాదునిగా చేసింది. తనివితీరగా సురాపానము చేసినవానివలె ఈసంతోషం నాతలకెక్కి శరీరంచులకపడి వాయు వులో తేలిపోతున్నట్లుగా ఉంది. ఇంక నక్కడ ఉంటే పిచ్చి యెత్తుతుందేమోనని భయపడి ఇంటికి పోదామని బయలుదేరాను.

అప్పటికి సుమారుఒంటిగంటపైగా అయింది. కొంత మంది జనం మళ్లుమొగం పెట్టారు. నేను మెమ్మ దిగా సమ్మర్దంతప్పించుకొని సుంకువారి వీధిలోనికి వచ్చి అక్కడనుంచి వెంకటరంగంపిళ్లవీధులోనికి వెళ్లాను. అక్కడ పదిగజాలదూరములో కొంతమంది జనం కూడిఉన్నారు. ఒక ఆడమనిషి కేకలు విన పడ్డాయి నేను తొందరగా అడుగువేసి అక్కడికి చేరుకొన్నాను. ఆజనాన్ని చూచి 'ఏమిటిఅల్లరి! మంచి పౌరుషశాలులే! ఇంతమందిచేరి పరదేశస్థురాలగు ఆమెకు తెలియని భాషలో ఏమిటి అంటున్నారు? ఏది మొగాళ్లు! ఇప్పుడు మాట్లాడండి చూతాము, Police man కూడా సమీపంలోనే ఉన్నాడు.' అనే సరికి ఇల్లేసామి అని ఎవరిమట్టుకువారు జారి పోయారు.

ఆ స్త్రీ ఒక్కర్తే వెక్కి-వెక్కి ఏడుస్తూతలవంచుకు నిలబడ్డది. నాకు జాలివేసి 'ఏవమ్మా భయంలేదులే. ఇంక ఎవళ్లూ నీజోలికిరారు. నీవు నిర్భయంగా వెళ్లవచ్చును' అన్నాను.

ఆమెవైఖరినిబట్టి బట్టకట్టునుబట్టీ ఆంధ్రవనితఅని ఊహించాను. నేను పలుకరించగానే ఆమె తల ఎత్తి నాకేసి నిదానంగా కన్నీటిచాటునుంచి చూ చింది. విచారముచేత పొంగినకళ్లు కాటుకకంటి నీటిచే తడిసి మలినమైన చెక్కిళ్లు ముఖంలో కన పడుతున్న నిస్పృహా చూస్తే దైన్యము మూర్తీభవించి నట్లు కనపడ్డది. వర్షపుమబ్బుచాటునుంచి తొంగి చూచే చంద్రబింబమువంటి ఆమెముఖంచూస్తేనిరుప మానసౌందర్యవతి అని తెలుస్తోంది. ఆమె వయస్సు సుమారు పందొమ్మిది, ఇరవై సంవత్సరములకంటె ఉండదు. ఆమెశరీరం చూస్తే శిల్పిచెక్కిన విగ్ర హాన్ని మించిపోయి లావణ్యనిధివలె అగుపిస్తోంది. నేను అనేకవేలమంది స్త్రీలను చూచాను. అత్యంత సౌందర్యవతులనుకునే వాళ్లనుకూడా చూచాను. కాని ఈమె పక్కను నిలబడతగ్గవాళ్లు ఎవరో నాకప్పుడు స్ఫురణకురాలేదు. ఆంధ్రులలో అం దమూ, నాజూకూ ఏనాడో అంతరించిన వని అను కునేవాడిని. అపయశస్సును పోగొట్టడానికి ఈపిల్ల ఒకర్తే చాలు.

ఆమె మాట్లాడకుండా అలాగే నిలబడ్డది. 'ఏమమ్మా ఎక్కడకు వెళ్ళవలెను? భయంలేదులే చెప్పు'

అన్నాను. దానితో ఆమె మళ్ళీ కంటనీరుపెట్టుకొని, పొంగివస్తూన్న దుఃఖాన్ని ఆపుకొని, తను బ్రాహ్మణబాలిక నని, గోదావరిజిల్లానుంచి ఈ వూళ్లో బంధువులింటికి వచ్చానని, ఇంకా కొందరు ఆడవాళ్ళతో ఉత్సవం చూడడానికి వచ్చాననీ జనసమూహంలో వాళ్ళనుంచి విడిపోయి దారితప్పి పోయాననీ, ఏమి చెయ్యడానికీ ఎక్కడికి వెళ్ళడానికీ తోచక వీధంటవస్తూ దారి అడుగుతే ఆ మనిషి ఏదో అన్నాడనీ చెప్పి, ‘తండ్రీ సమయానికి దేవుడులా వచ్చారు. లేకపోతే నా గతి ఏమయ్యేదో’ అని మళ్లీ కంటనీరుపెట్టుకుంది. ‘మరి అయితే ఇంటికి వెళ్లగలవా’ అన్నాను. తనకు దారితెలియదనీ ఆ వీధిపేరుకూడా బాగా తెలియదని మైలాపూరులో తన బంధువు ప్లీడరనీ చెప్పింది. ‘సరే అయితే నీకేమి భయంలేదు. నేను తీసుకువెళ్ళి మీ ఇంటిదగ్గర దిగబెడతా’నని చెప్పాను. మొదట కొంచెము సందేహించింది కాని మరొక దారిలేక నాతో రావడానికి అంగీకరించింది

ఆ వీధిచివరనే ఒకరింటిదగ్గర నిలబెట్టిన నాకారు దగ్గరకు తీసుకువెళ్లి ఎక్కమన్నాను మళ్లీ కొంచము తటపటాయించింది. ‘భయంలేదమ్మా ఎక్కు, లేకపోతే ఇందాకటి మోస్తరుగానే జరుగుతుంది’ అన్నాను. దానితో భయపడి కారులోఎక్కి కూచుంది.

నేనూ లోపలికి ఎక్కి In house రోడ్డులోనుంచి మెరీనాకు దారితీశాను. చల్లగాలి, సముద్రపుహోరు, ఇవన్నీనిర్మలమైనఆకాశం, నాపక్కనసౌందర్యరాశి నాసదుద్దేశాన్నిమార్చి నన్ను సాయంకాలంనుంచి దహించివేస్తూన్న కామోద్రేకాన్ని ద్విగుణీకృతం చేశాయి. నామదనాగ్నికి తగ్గఆహుతి దొరికిందనుకున్నాను. ఈ పిల్లను అనుభవించిమరీ ఆమెను పంపవలెనని నిశ్చయించుకున్నాను. ఆమె అంగీకరించదేమోనన్న ఆలోచనేనాకు తోచలేదు. మొదట కాస్త బిగిసినా తరువాత నాచేజిక్కిన వెనక ఒప్పుకోక ఏమిచేస్తుం దనుకున్నాను.

ఆపిల్లను మొదటచూచినప్పుడు కలిగిన జాలిఅంతా అంతరించింది. ఈరూపందాల్చిన చక్కదనాన్ని ఎప్పుడు కౌగిటచేర్చుదామనే ఆతురత తప్ప మరొకటేమీ తోచలేదునాకు. ఇటువంటి అవకాశములు అనేకం వచ్చినాయి నాజీవితంలో. అనేకసార్లు ఆఅవకాశములను ఉపయోగించుకున్నాను. ఇప్పుడు మట్టుకు అలా ఎందుకుకాకూడదు. ఇటువంటిపిల్ల నాభార్య అని చెప్పుకోగలిగిన ధన్యుడెలాటివాడై ఉంటాడా అనుకున్నాను. ఈచక్కదనానికి తగ్గవాడవునా కాదా అనే ఆలోచన పోయింది. ఈమెకు తగినవాడని చెప్పతగిన పురుషుడు సృష్టిలో ఉంటాడా అనిపించింది. నెమ్మదిగా Ethiop's beach చేరి కారు ఆపాను. అదివరకు ఏమి ఆలోచించుకొంటోందో కాని కారు ఆగడముతోనే ఉలిక్కిపడి నాల్గుప్రక్కలా చూచింది నేను దిగి ఆమె కూర్చున్నవైపువెళ్ళి తలుపుతీసి దిగమన్నాను. తెల్లపోయి ‘ఎందుకు’ అంది.

‘కొంచెముసేపు ఈ చల్లగాలిలో కూర్చుని పోవచ్చును’ అన్నాను.

‘కాదు నన్ను త్వరగా ఇంటికి తీసుకువెళ్ళండి’ అంది. ‘అలాగేలే. త్వరగానే వెడదాము. రా’ అని చెయ్యిపట్టుకున్నాను. కేకవెయ్యబోయింది. ఒకచెయ్యి నోటిమీదవేసి, రెండవచెయ్యి ఆమె నడుముచుట్టూవేసి బలవంతాన బయటకు లాగి సముద్రపుటొడ్డుకు తీసుకువెళ్లాను. ఆ ఇసుకతిన్నె మీదకూర్చుని, నాపక్కనేకూర్చోపెట్టుకొని నోటిమీదచెయ్యితీసి గట్టిగా కౌగలించుకొని, ‘ఎందుకలా భయపడతావు. ఇప్పుడే తీసుకువెళ్ళి మీఇంటిదగ్గర దిగబెడతాలే’ అన్నాను. ‘మీరు తండ్రివంటివారనుకుని మిమ్మల్నినమ్మినాను. మీరూ ఇలాటివారేనా’ అంది ఏడుస్తూ. అప్పటికీఆమనిషిస్వభావం తెలుసుకోలేక పోయాను. ఇవి మామూలు మాటలే అనుకున్నాను. మరొక్కమాటైనా అడలేదు. కేకలన్నా వెయ్యలేదు. నా కౌగిటిలోనుంచి విడిపించుకునేప్రయత్నమైనా చేయలేదు. నేనుఏమనుకోను?

నా కౌగిలిపట్టు ఇంకా బిగించి ఒక్కముద్దు పెట్టుకున్నాను. నిర్ఘాంతపోయి నాకేసిచూచింది. ఆ చూపు జన్మజన్మాలకూ నాకుమరపురాదు. భయము సంభ్రమము ఆశ్చర్యము, ఇంకా ఎన్నెన్నో భావాలు ఆచూపులో కనపడ్డాయి. ఒక్కచూపులో ఏకకాలమందు ఇన్ని భావములు ప్రదర్శించుటకు సాధ్యమౌతుందని నేను ఎన్నడూ అనుకోలేదు. మరొకళ్ళుఅయితే ఆ చూపుకి భయపడి అంతటితో తమ ప్రయత్నమును మానుకునేవారేమో! నేనైనా మరొక సమయంలో అయితే బాగా ఆలోచించి మరీ ముందుకు సాగే వాడిని. కాని ఆక్షణంలో నాకు వొళ్ళు తెలియలేదు. నాశరీరంలో ప్రతి రక్తబిందువూ ఉడికిపోతోంది. సర్వేంద్రియములూ స్వాధీనము తప్పిపోయినాయి. న్యాయాన్యాయవిచక్షణావిహీనుడనయిపోయినాను. ప్రమాదస్థితిని తెలుసుకోలేకపోయినాను అంతేకాకుండా పతివ్రతలంటూ ప్రపంచములో ఉన్నారని నాకు నమ్మకంలేదు. ఎటువంటి స్త్రీఅయినా, ఏదోరూపంలో తగినంత ప్రతిఫలం దొరుకుతే పరపురుషుడికి స్వాధీనం కావడాని కంగీకరిస్తుందని నా దృఢవిశ్వాసము. వాడెవడో చెప్పినట్లు (Every woman has her price) అనేమాట ముమ్మాటికి సత్యం అని నా నమ్మకం; అనుభవంకూడాను. అటువంటప్పుడు ఈ పందొమ్మిదేళ్ల పల్లెటూరుపడుచు వారందరికీ అతీతురాలని ఎలా అనుకోను?

ప్రపంచమంతా నిశ్శబ్దము. సముద్రపుహోరుకూడా ఆక్షణంలో నాచెవిని పడలేదు. చేతనాచేతన ప్రపంచమంతాకూడా ఒక్కసారి ఊపిరి బిగబట్టి ఏమి జరుగుతుందో చూతామని ఆశ్చర్యముతో వేచిఉన్న దనుకుంటాను. ఆకాశముమట్టుకు తన అనంతకోటినక్షత్రకాంతులతో నవ్వుతున్నట్లున్నది. నామదనాతురత నింక నణచుకోలేకపోయాను. ఆపిల్లను నావడిలోకి లాక్కొని రొమ్ముమీద చీరారవికా తొలగించి ఒళ్ళుతెలియకుండా లెక్కలేని ముద్దులుపెట్టుకున్నాను. ఒక్కొక్కముద్దు పెట్టుకుంటున్న కొద్దీ నాఆవేశము మరీ హెచ్చిపోయింది. ఆపిల్ల నిర్నిమీలిత శూన్యదృష్టితో నాముఖంకేసి చూస్తూ ఊరుకుంది. గత్యంతరంలేక శరీరంనాకు వప్పగించింది అనుకున్నాను. మొదట నా చేతులలో ఆమెశరీరం కొంచెము బిగియపారిం దనుకున్నాను. క్రమేణా పట్టు తప్పిపోయినట్లు నా చేతుల్లోనుంచి జారిపోవడము మొదలుపెట్టింది. నే నీ ముద్దులతో ఊపిరి ఆడక ఆమెను ఇసుక మీదకు జారవిడిచి ఒక్క రెప్పపాటు ఊపిరితీసుకున్నాను. రెప్పవాల్చకుండా ఆమె అలాగేనాకేసి చూస్తోంది. ఎందుచేతననే ఆలోచనతోచలేదు నాకు. పునరాలింగన చుంబనాదుల కామెను లేవదీయబోయాను. ఆమెశరీర మదొకమాదిరిగా బలుసెక్కినట్లు తోచింది. తల వెనక్కి పడిపోయింది. ఇదేమిటి మూర్ఛపోయిందా అనుకుని మళ్ళీ పడుకోపెట్టి ఇటూఅటూ కదిపి పలకరిస్తే పలకలేదు. అరిచేతులూ అరికాళ్లూ రాశాను. నీటివొడ్డుకుపరుగెత్తికెళ్ళి దోసిలితో నీళ్లుతెచ్చి ముఖాన్ని చల్లాను. ఏమిచేసినా లాభంలేకపోయింది. ఇదొక జబ్బు కాబోలు, క్రమేణ తెలివివస్తుం దనుకున్నాను. అప్పటికి నాఉద్రేకం చల్లారింది. ఒకవిధమైన భయ మారంభమయింది. ఇంటికి పోయేవాడిని పోక ఇదెందుకు తెచ్చుకున్నానా అనుకున్నాను. అలాగు అరగంటో ముప్పావుగంటో కూర్చున్నాను. ఎంతకూ ఆమెకు తెలివిరాలేదు. సరిగదా క్రమేణా వొళ్లు నఖశిఖపర్యంతం చల్లపడిపోయింది. ఆపిల్ల చనిపోయిందని గ్రహించాను. వర్ణనాతీతమైన భయంతో నా శరీరంయావత్తూ కంపించిపోయింది. నా ప్రథమచుంబనముతో ఆమెముఖమును నేను మలినపరచినప్పుడే ప్రాణం పోయిఉండవలెనని ఊహించాను. ఆ నిర్నిమీలితదృక్కులభావ మది అయిఉండవలెను. పాపం, యౌవనోదయవేళ తన వాళ్ళందరకూ దూరమై, ఈ నిర్జనప్రదేశంలో పరాయివాని చేతిలో ఈ నిర్భాగ్యపుబలవన్మరణం రాసిపెట్టిఉన్నది ఆ పిల్లకు. నేను హంతకుడిని. చేష్టలుడిగి, రాతిబొమ్మలా కూర్చున్నాను.

వొళ్లు ముచ్చెమటలూపోసి నీరుకారిపోవడం మొదలెట్టింది. ఆ పిల్లమీద జాలిపోయి ముందు సంగతేమిటనే ఆలోచన పోయింది. కూర్చున్న కొద్దీ ప్రతిక్షణమూ ప్రమాదకరమని తోచింది. అదివరకు నిర్జనమనుకున్న సముద్రతీరం అనేక కోట్ల జీవరాసులతో నిండిఉన్నట్లు తోచింది. నిశ్శబ్దంగా ఇంతవరకూ ఉన్న సముద్రం గర్భనిర్భేదముగా రోదించడం మొదలెట్టింది. స్తంభించిపోయినదనుకున్న వాయువు ప్రచండవేగముతో నా చెవులు చిల్లులు పడేటట్లు కోటిగొంతుకలతో అరవడము ఆరంభించింది. దూరాన్ని వెదుకుతున్న మోటారు కారు ఒకటి ప్రళయ గర్జనంతో నామీద వచ్చి పడుతుందనుకున్నాను. నా వెనుక తిరువళిక్కేణి ఉత్సవములోని దీపపుకాంతులు నరకజ్వాలలులా కనపడ్డాయి. ఆకాశాన ఉన్న నక్షత్రకోటులు కన్నీరు కార్చడం మొదలెట్టినాయి. దిక్కులేకుండా నిర్జన ప్రదేశంలో చనిపోయిన ఈపిల్లకోసం చేతనాచేతన ప్రపంచం యావత్తూ విచారిస్తున్నట్లు తోచింది.

అనిర్వాచ్యము అపూర్వము అననుభవము అయిన మహాభీతి నన్నావరించింది. ఆ కళేబరాన్ని ఎవరికంటా పడకుండా ఎక్కడో పారవేసి నేను ఇల్లు చేరడమే ప్రధానకర్తవ్యమని తోచింది. భయముతో స్వాధీనము తప్పిపోయిన అవయవములకు వింత బలం వచ్చింది. మంచుకంటె చల్లనై కొయ్యబారిన కళేబరాన్ని తీసుకొని కారులో పడేసి మళ్ళీ కారువచ్చినదారినే తిప్పి కోటసమీపంలో కారు ఆపి ఈవింతబరువును మోసుకొని సముద్రంలో వీలైనంతలోతుకు తీసుకువెళ్ళి నీళ్ళలో గిరవాటు వేశాను. ఆఖరుసారి ఆఅమ్మాయి ఆ Shocked innocent చూపుతో నన్ను మందలించింది. నాటనుండి ఈఆఖరుక్షణంవరకూ అహర్నిశములు జాగ్రత్స్వప్న సుషుప్తులలోకూడా ఆ కడసారిచూపు నన్ను వెంబడిస్తూనే ఉంది. అనేక జన్మపరంపరలలో నాటి మహాపాపమునకు తగ్గ ప్రాయశ్చిత్తమును అనుభవించి పునీతుడనయ్యేవరకు ఆ చూపు నన్ను వదలదనుకుంటాను. కాని సముద్రుడు నారహస్యమును దాచడానికంగీకరించలేదు. మహాక్రోధంతో ఒక పెద్దతరంగం నన్ను అవతలికి గెంటేసి ఆపిల్లను నెమ్మదిగా వొడ్డుకు చేర్చింది. నేనక్కడ ఇంకనిలబడలేకపోయాను.

తిన్నగా నాకారు ఎక్కి వెయ్యిభూతములు ఆవహించినట్లు మనోవేగంతో ఇంటికి వచ్చిపడ్డాను. అక్కడ కూడా ఆగ బుద్ధిపుట్టలేదు. తడిబట్టలు విడిచేసి పొడిబట్టలు కట్టుకొని మళ్ళీ కారులో కూర్చుని బయలుదేరాను. ఎక్కడికో నాకే తెలియదు. కారు ఏదారిని వెడుతోందో దారిలో ఏమున్నదో చూచుకోలేదు. మరొక్క రెవ్వరో నడుపుతున్నట్లుంది కాని నేనే నడుపుతున్నా ననుకోలేదు. కారుకి ఉన్న యావచ్ఛక్తీ వినియోగించిఉంటాను. సుమారు ఏడుగంటలయ్యేసరికి నాకు తెలియకుండా బెంగుళూరు చేరాను. తిన్నగా మనబంగాళాకు వెళ్ళాను. ఈచెప్పకుండా రావడం నాముఖవైఖరీ చూచి నౌఖరులు ఆశ్చర్యపోయారు. నేను ఎవ్వరితో మాట్లాడకుండా తిన్నగా కారులోనుంచిదిగి పడకగదిలోకివెళ్ళి కోటైనావిప్పకుండా పడుకున్నాను. నౌఖరు ఏదో అడిగాడు. నేను జవాబుచెప్పలేదు. ఇంక ప్రపంచ మెరుగను. తరువాయి సంగతి నాకు జ్ఞాపకం ఉండిఉంటుంది. సుమారు నెల రోజులవరకూ వొళ్ళుతెలియని జ్వరం, స్మృతిలేకపోవడం, హఠాత్తుగా తలంతా నెరవడం, డాక్టర్లు Brain fever అనుకోవడం, 20 రోజు లయిన తరువాత ప్రాణభయంలేదని వైద్యులు నిర్ణయించడం, విరామంలేనిపనివల్లా తీవ్రాలోచన వల్లా (Nervous break down) వచ్చిందని ఆరుమాసములువిశ్రాంతి తీసుకొని దేశాటన చెయ్యమనడం ఆప్రకారం మనం తిరగడం నువ్వు ఎరిగున్నదే. ఇదీ నేను చేసిన విరామంలేనిపని, తీవ్రాలోచనాను.

... ...

ఇంక నీతో చెప్పవలసిన దేమీలేదు. నవ్వుచెప్పవలసిన ఆస్తి అంతకంటే లేదుకదా. నీదారి నీవు చూసుకోవలసిందే.......నాకు జీవితంలో రెండే ఆదర్శాలు ఉండేవి. నేను విశేషంగా ధనార్జన చేసి, ఏదో మహోన్నతపదవి పొందవలెనని; రెండవది, నిన్ను పురుషోత్తమునిగా చేసి నీకేదో మహాసామ్రాజ్యపట్టాభిషేకం చేయవలెనని. ఇందులో ఏదీకూడా చెయ్యలేకపోయాననేవిచారం కొంతకాలం ఉండేది కాని ఇప్పు డదికూడాలేదు. వారివారి జన్మాంతరసంస్కారమునుబట్టి ఏవో కొన్ని సంకల్పములు కలగడమే కాని వాటి నిర్వహణము మట్టుకు మనదికాదు. నేను ఆత్మహత్య చేసుకుందామని నిశ్చయించుకొని నప్పటినుంచి, నా అభిప్రాయాల్లో, దృక్పథంలో చాలా మార్పు వచ్చింది. మనం జీవితంలో ప్రధానమనుకున్నవన్నీ అప్రధానంగాను అప్రధానమనుకున్నవన్నీ ప్రధానంగానూ కనపిస్తున్నా యిప్పుడు.

సముద్రయానం చేసేటప్పుడు నావ ఒడ్డునుంచి దూరమైనకొద్దీ నిత్యజీవనాని కత్యవసరమనుకున్న సమస్తపదార్థములూ, రోడ్లు, బళ్ళు, ఇళ్ళు, వాకిళ్ళు, నదులు, పర్వతములు సమస్తమూ మాయమై, పంచభూతములూ తప్ప మరేమీ గోచరించనట్లే నేను ఈ ప్రాణప్రయాణసమయంలో ఇహపరముల మధ్యను నిలబడి ఒక్కసారి సింహావలోకనం చేస్తే వస్తుస్వరూపములూ, తత్వములూ, విలువలూ తారుమారై జీవితంలో మనకు కనపడే కృత్రిమాకారాలను విడిచి, నిజస్వరూపంతో నిజస్వభావంతో నిజస్థానంలో కనపడుతూ ఉంటాయి. ఆఖరుకు బ్రతికి ఉన్నన్నాళ్లూ, శత్రివాళ్లూ, అప్రయోజకులూ దేశవినాశనానికి కారకులూ అనుకున్న తత్వవేత్తలమాటే—సత్యం నిత్యం, అనుకున్నది అసత్యం అనిత్యంగానూ, అనిత్యమూ అసత్యమూ, అనుకున్నదే నిత్యము సత్యముగాను కనుపిస్తోంది.

... ...

నీకు తత్వోపదేశం చేదామని కాదు నా ఉద్దేశం, చేసినా నువ్వు వింటావనే నమ్మకంలేదు నాకు. నా ముందు నడచిన మహానుభావులమాట బ్రతికి ఉన్నన్నాళ్లూ నేను విన్నాను గనుకనా!

... ...

ఇదివరకెన్నడూ ఈ రహస్యములను ఎవ్వరితోటీ చెప్పడానికి భయపడ్డాను. అందులోనూ ముఖ్యంగా నీతో చెప్పడాని కసలే సిగ్గుపడ్డాను. ఏతండ్రీ తనకన్న బిడ్డలయెదుట చులకనపడడానికి ఒప్పుకోడు కదా! ఇప్పుడు చెప్పకుండా ప్రాణంవిడవలేక పోయాను. ఇంక నెవరేమనుకున్నా నాకు విచారం లేదు. ఈ తుచ్ఛప్రపంచంయొక్క దూషణ భూషణతిరస్కారములు అందనిచోటికి పోతున్నాను. నేను ఉన్న స్థితిలో దారిద్ర్యాన్ని చూచి జాలిపడి చేతనైన సహాయం చెయ్యడానికిబదులు, ధనమదాంధత చేత, అదరమ్రిగ్గి అధఃపాతాళానికి అణగద్రొక్క వాడి చావుకి కారకుడిని అయ్యాను. ఈదుష్టప్రపంచంలో అదృష్టము, అలభ్యమూ అయిన, అమాయికత్వమూ, పవిత్రతా కనపడినప్పుడు గౌరవించి పూజించడానికిబదులు, వాటినిచంపేసి నట్టేటిపాలు చేశాను. ఇంతకంటె, ఒక్కజీవితంలో దుర్మార్గం ఏమిచెయ్యాలి!

నాయనా! నీవు నన్నుగురించి ఏమనుకొన్నా సరే కాని నేచేసిన ఈమహాపరాధములు రెండు మట్టుకు జ్ఞాపకం పెట్టుకో. నేను అనుభవించినవాటి ఫలితం మరచిపోకు. ఆఅపరాధములు మట్టుకు నీవేనా నీజన్మ మధ్యమందు చేయకూడదని నాకుదిగోరిక...బహుశా నీసమీపములో ఉండి చూస్తూ ఉంటాననుకుంటాను .... వెళ్ళనా నాయనా! సమయానికి దగ్గరేనాలేవు కదా! ......ఇదేమంచిది.........

పార్థసారథినాయుడు ఉత్తరంఅంటించేసి బల్లమీద పెట్టేసి ఒళ్లువిరుచుకొని కడసారి ఇల్లంతా తిరిగి, తోటలో ఒక్క సారి తిరిగి వచ్చి, జేబులోమాత్రలన్నీ నోట్లో వేసుకుని కాసిని మంచినీళ్లుతాగి మంచంమీద పడుకున్నాడు......

సమాప్తము.